Follow: @ANNTELUGU

29-10-2025

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 323 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఐదు కోట్ల ఏళ్ల రాయి సంచలనం

### మధిర రామాలయంలో చరిత్ర జాడ

రామాలయ పునర్నిర్మాణంలో వెలుగుచూసిన యుగాల సాక్ష్యం

దారుశిలాజంగా గుర్తించిన డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



**మధిర, మహా:** చరిత్ర కేవలం పుస్తకాల్లోనే కాదు ..భూమి పొరల్లో, రాళ్ల రూపంలో, మన సాంస్కృతిక సాక్ష్యాల మధ్యన కూడా దాగి ఉంటుంది. ఖమ్మం జిల్లా మధిరలో అలాంటి అద్భుత చరిత్ర సాక్ష్యం వెలుగుచూసింది. రైల్వే రామాలయం ప్రాంగణంలో పునర్నిర్మాణ పనుల సందర్భంలో కనుగొనబడిన ఒక రాయి ఇప్పుడు చరిత్రకారులు, పురావస్తు శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షిస్తోంది.

మిగతా 2లో


**టాప్ న్యూస్**



ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం

- మహాగఠ్‌బంధన్ మ్యానిఫెస్టో

02



మూడోసారి పోటీచేస్తా..

- డొనాల్డ్ ట్రంప్ సంచలనం
- పోటీకి అనేక మార్గాలు

03



నయనతార.. ఆల్ టైమ్ రికార్డ్

- చేతిలో 9 సినిమాలు

03



## కాంగ్రెస్ దే జోరు

- నవీన్ యాదవ్ కే మొగ్గు ఖరారు
- ఎఎన్ఎన్- మహా పోల్ లో తేల్చేసిన పబ్లిక్
- ఏకంగా 59వేల మంది ఓట్లేసి అభిప్రాయం

03





# సీఎం రేవంత్ మాస్టర్ స్కెచ్

### ఒక్క రోజులో చక్రం తిప్పేసిన అధినేత

**జూబ్లీహిల్స్ బైపోల్‌లో.. ప్రత్యర్థులకు షాక్**

ఇద్దరు మంత్రులకు ఒక్కో డివిజన్ బాధ్యతలు.. బూత్ ల వారీగా బాధ్యతల పంపిణీ

సినీ కార్మికులతో సమావేశం.. కమ్మ సంఘం నేతలతో భేటీ

వర్గాల వారీగా ఎక్కడికక్కడ మంత్రాంగం.. పీసీసీ చీఫ్ మహేష్ కీలక సమీక్ష

హైదరాబాద్, మహా: సీఎం రేవంత్ రంగంలోకి దిగడంతో జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరంగా మారింది. ఇప్పటికే ప్రచారానికి వస్తున్నానంటూ షెడ్యూల్ రిలీజ్ చేసిన సీఎం మంగళవారం ఎక్కడికక్కడ యంత్రాంగాన్ని మోహరిస్తూ మంత్రాంగం నడిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే ఒక్కో డివిజన్ బాధ్యతను ఇద్దరు మంత్రులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను ఎంత సీరియస్ గా తీసుకుందో స్పష్టమైంది. ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ ఛైర్మన్లకు బూత్ ల వారీగా బాధ్యతలు అప్పగించారు. మంగళవారం సినీకార్మికులు నిర్వహించిన అభినందన కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, సాయంత్రం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బండి రమేష్ ల తో కలిసి వచ్చిన కమ్మసంఘం నేతలతో భేటీ అయ్యారు.

వివరాలు 2లో

## సినీ కార్మికులకు సీఎం రేవంత్ గుడ్‌న్యూస్

**కార్మికుల సంక్షేమ నిధికి రూ.10 కోట్లు**

వివరాలు 2లో

## ఏరో-ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

### 2030 నాటికి తీర్చిదిద్దేలా సమగ్ర రోడ్ మ్యాప్

ఇక్కడి నుంచే ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్"

రూ.425 కోట్ల పెట్టుబడి... 500 మందికి కొత్తగా ఉద్యోగాలు

ఆదిభట్ల "న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, మహా :** నాటికి తెలంగాణను దేశ "ఏరోఇంజిన్" రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర "రోడ్ మ్యాప్"ను సిద్ధం చేస్తున్నామన్నారు. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్" , "సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్" సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్"

మిగతా 7లో



## అమెజాన్‌లో 30 వేల మంది ఔట్

### 2022 తర్వాత తొలగింపు ఇదే అత్యధికం

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** దిగ్గజ్ టెక్ సంస్థ అమెజాన్.. ఖర్చులు తగ్గించుకునే పనిలో పడింది. మంగళవారం నుంచి దాదాపు 30వేల కార్పొరేట్ ఉద్యోగాలకు కోత పెట్టనున్నది. కొవిడ్ విశ్వమారి సమయంలో డిమాండ్ పీక్ స్టేజ్‌లో ఉండటంతో అమెజాన్ కంపెనీ లెక్కకు మించి ఉద్యోగులను నియమించుకున్నది.

మిగతా 2లో

## హరీశ్‌రావుకు పితృ వియోగం

### తన బావకు నివాళులు అర్పించిన కేసీఆర్

సీఎం రేవంత్, చంద్రబాబు, మంత్రులు సహా పలువురి సంతాపం

భారీగా తరలివచ్చిన లీడర్లు.. మహాప్రస్థానంలో ముగిసిన సత్యనారాయణ అంత్యక్రియలు

పాడెమోసిన కేటీఆర్.. చివరిచూపుకు కవిత దూరం

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు.

మిగతా 2లో





## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- 8వ పే కమిషన్ టీఓఆర్‌కు క్యాబినెట్ పచ్చజెండా
- జీతాలు, పెన్షన్లు పెంచేందుకు వీలుగా వేతన సంఘం ఏర్పాటు

వివరాలు 2లో

## హైదరాబాద్ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

### పాదయాత్రలతో ఓటర్ల దగ్గరకు బీజేపీ నేతలు

అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో మాస్ క్యాంపెయిన్

పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. మంగళవారం నియోజకవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు నేతృత్వంలో 'మాస్ కాంపెయిన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు ప్రతి ఓటరునూ కలుసుకుని ఓట్లు అభ్యర్థించేలా పాదయాత్రలు నిర్వహించారు. ఎన్ రామచంద్రరావు ఎర్రగడ్డ డివిజన్‌లో పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శ్రీనగర్ కాలనీ, ఎల్లారెడ్డిగూడలో, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ బోరబండ డివిజన్ రాజ్ నగర్‌లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

మిగతా 2లో

## తుమ్మిడిహట్టి టు సుందిళ్ళకు 80 టీఎంసీలు

### తరలించేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్మాణం

సీఎం రేవంత్ కీలక నిర్ణయం

నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్ష



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి నివేదికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారిగా విశ్లేషణలు జరగాలని స్పష్టంగా చెప్పారు. కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్' (సీడీఎస్ఈ) కు సంబంధించి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల రాసిన లేఖపై మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,25,620 |
| 22 క్యారెట్ | 1,15,150 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 84,211.88 |
| నిఫ్టీ ↗ | 25,795.15 |






# సీఎం రేవంత్ మాస్టర్ స్కెచ్

## ఒక్క రోజులో చక్రం తిప్పేసిన అధినేత

### జూబ్లీహిల్స్ బైపోల్‌లో.. ప్రత్యర్థులకు షాక్

ఇద్దరు మంత్రులకు ఒక్కో డివిజన్ బాధ్యతలు.. బూత్ ల వారీగా బాధ్యతల పంపిణీ

సినీ కార్మికులతో సమావేశం.. కమ్మ సంఘం నేతలతో భేటీ

వర్గాల వారీగా ఎక్కడికక్కడ మంత్రాంగం.. పీసీసీ చీఫ్ మహేష్ కీలక సమీక్ష

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రంగంలోకి దిగడంతో జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరంగా మారింది. ఇప్పటికే ప్రచారానికి వస్తున్నానంటూ షెడ్యూల్ రిలీజ్ చేసిన సీఎం మంగళవారం ఎక్కడికక్కడ యంత్రాంగాన్ని మోహరిస్తూ మంత్రాంగం నడిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే ఒక్కో డివిజన్ బాధ్యతను ఇద్దరు మంత్రులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను ఎంత సీరియస్ గా తీసుకుందో స్పష్టమైంది. ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ ఛైర్మన్లకు బూత్ ల వారీగా బాధ్యతలు అప్పగించారు. మంగళవారం సినీకార్మికులు నిర్వహించిన అభినందన కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, సాయంత్రం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బండి రమేష్ ల తో కలిసి వచ్చిన కమ్మష్ం నేతలతో భేటీ అయ్యారు. సీఎం నేరుగా రంగంలోకి దిగి ఎక్కడికక్కడ పావులు కదుపుతుండడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. పలువురు మైనారిటీ నేతలతో సీఎం మాట్లాడడంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ఛైర్మన్లు కూడా నేరుగా టచ్ లోకి వెల్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ తో బిఆర్ఎస్ వైపు వెళ్ళిన మైనారిటీ నేతలు కూడా బ్యాక్ టు పెవిలియన్ అన్నట్లుగా కాంగ్రెస్ కు జై కొడుతున్నారు.

**మంత్రులకు అప్పగించిన డివిజన్లు ఇవే**

- రహమత్ నగర్ డివిజన్ కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- బోరబండ డివిజన్ - సీతక్క, మల్లు రవి,
- వెంగల్ రావు నగర్ డివిజన్ తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరిలు,
- సోమాజిగూడ డివిజన్ శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్
- షేక్ పేట డివిజన్ కొండా సురేఖ, వివేక్
- ఎర్రగడ్డ డివిజన్ దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణరావు
- యూసఫ్ గూడ డివిజన్ - ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్

**సీఎం ధూంధాం**

ఉప ఎన్నిక కైవసం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి ఈ నెల 31 వ తేదీ ఉదయం 7గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావు నగర్‌లో రాత్రి 8 గంటలకు సోమాజిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. నవంబర్ 1వ తేదీ ఉదయం ఏడు గంటలకు వెంగళరావునగర్ సోమాజిగూడలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. అలాగే నవంబర్ 1న ఉదయం బోరబండలో, రాత్రి 8 గంటలకు ఎర్రగడ్డలో, 4వ తేదీన ఉదయం షేక్ పేట 1డివిజన్ లో, రాత్రి రహమత్ నగర్ లో ప్రచారం చేస్తారు. 5వ తేదీన ఉదయం షేక్ పేట 2లో, సాయంత్రం యూసఫ్ గూడలో, 8వ తేదీన ఆరు డివిజన్లలో మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొంటారు. 9వ తేదీన షేక్ పేటలో ఉదయం 10గంటలకు మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

# సినీ కార్మికులకు సీఎం రేవంత్ గుడ్‌న్యూస్

## కార్మికుల సంక్షేమ నిధికి రూ.10 కోట్లు

**హైదరాబాద్, మహా :** సినీ కార్మికులకు సీఎం రేవంత్ గుడ్‌న్యూస్ చెప్పారు. సినీ కార్మికుల సంక్షేమానికి ఒక వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సంక్షేమ నిధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సినిమా నుంచి వచ్చే ఆదాయంలో కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాలని సినీ ఇండస్ట్రీకి సూచించారు. అంతేకాదు రాబోయే రోజుల్లో సినిమా టికెట్ల ధరలను పెంచాలనుకుంటే.. అందులో 20 శాతం వాటా సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇస్తేనే పర్మిషన్ ఇచ్చేలా జీవోలో నిబంధనలు సడలిస్తామని పేర్కొన్నారు. అలాగే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో ఓ స్కూల్ నిర్మించి సినీ కార్మికుల పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో సినీ ఫైటర్స్ ట్రైనింగ్‌కు స్థలం కేటాయిస్తామన్నారు. సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినీ ఇండస్ట్రీని హైదరాబాద్‌కు తరలించేందుకు ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. డా. ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం మణికొండలో 10 ఎకరాల సొంత స్థలం ఇచ్చారని తెలిపారు. చిత్రపురి కాలనీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. చిత్ర పరిశ్రమలో కార్మికులు, కళాకారులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని.. అందుకే దిల్ రాజుకు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కొన్నేళ్ల క్రితం నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డులు ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుందన్నారు. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికుల సమస్యలపై మరోసారి సమావేశమవుతామని పేర్కొన్నారు.

# ఐదు కోట్ల ఏళ్ల రాయి సంచలనం

## మధిర రామాలయంలో చరిత్ర జాడ

**రామాలయ పునర్నిర్మాణంలో వెలుగుచూసిన యుగాల సాక్ష్యం**

**దారుశిలాజంగా గుర్తించిన డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి**



(మొదటిపేజీ తరువాయి)

సాధారణంగా కనిపించిన ఈ రాయి, అసలు ఐదు కోట్ల సంవత్సరాల పురాతన దారుశిలాజమని నిర్ధారించడం సంచలనం రేపింది. ప్రకృతి శక్తుల సాక్ష్యంగా నిలిచిన ఈ రాయి ఇప్పుడు మధిర రామాలయ పునర్నిర్మాణానికి మాత్రమే కాదు, భారత ఉపఖండ భూగర్భ చరిత్రకు కూడా కొత్త అధ్యాయాన్ని తెరచింది. మధిర రైల్వే రామాలయం పునర్నిర్మాణం కోసం ఆలయ కమిటీ, పట్టణ ప్రముఖులు, రైల్వే అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త, వాస్తు నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రామాలయ ప్రాంగణాన్ని సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించిన సూచనలు, వాస్తు సలహాలు ఇవ్వడంలో నిమగ్నమైన ఆయన దృష్టి ప్రాంగణంలోని ఒక ప్రత్యేక రాయిపై పడింది. ఆ రాయిని సమగ్రంగా పరిశీలించిన అనంతరం, అది సాధారణ రాయి కాదని గుర్తించారు. ప్రకృతి వైపరీత్యాలు, భూభాగ మార్పులు, చెట్ల కట్టెల శిలీభవన ప్రక్రియల ఫలితంగా ఏర్పడిన దారుశిలాజం అని నిర్ధారించారు. ఈ రాయి వయసు సుమారు ఐదు కోట్ల సంవత్సరాలు ఉంటుందని డాక్టర్ శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి శిలాజాలు భూమి పరిణామ చరిత్రను అర్థం చేసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు.

**మధిరకు ఘనచరిత్ర**

"మధిర ప్రాంతం భూగర్భపరంగా చాలా ప్రాచీన చరిత్ర కలిగిన ప్రాంతం. ఇక్కడ దొరికిన ఈ శిలాజం, దక్షిణ భారత భూభాగం ఆవిర్భావాన్ని అర్థం చేసుకోవడంలో విలువైన ఆధారంగా ఉపయోగపడుతుంది," అని ఆయన తెలిపారు. ఈ రాయిని మరింత విస్తృతంగా విశ్లేషించేందుకు హైదరాబాద్ పురావస్తు ప్రయోగశాలకు పంపిస్తున్నట్లు డాక్టర్ శివనాగిరెడ్డి వెల్లడించారు. అయితే, ఈ దారుశిలాజం కనుగొనబడిన ప్రదేశం యాదృచ్ఛికం కాదని ఆలయ కమిటీ సభ్యులు అంటున్నారు. "శ్రీ రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ పునాది తవ్వకాల సమయంలో ఈ రాయి బయటకు వచ్చింది. ఇది దేవాలయ పుణ్యక్షేత్రంలో లభించడం దైవసంకేతంగా భావిస్తున్నాం," అని కమిటీ సభ్యులు తెలిపారు. మధిర పట్టణం చరిత్రాభిమానుల దృష్టిని ఆకర్షించింది. స్థానికులు పెద్దఎత్తున రామాలయ ప్రాంగణానికి చేరుకొని ఆ రాయిని ఆసక్తిగా పరిశీలించారు. "ఇంత పురాతన శిల మధిరలో లభించడం గర్వకారణం. ఇది మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపుని తీసుకువస్తుంది," అని పట్టణ ప్రముఖులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రాయిని రక్షణాత్మకంగా నిల్వ చేసి, శాస్త్రీయ విశ్లేషణ అనంతరం మధిర రామాలయం చరిత్ర ప్రదర్శన గ్యాలరీలో ప్రదర్శించాలనే యోచనలో కమిటీ ఉంది. రైల్వే అధికారులు కూడా దీన్ని స్థానిక వారసత్వ భాగంగా ప్రకటించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

# హైదరాబాద్ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమాల్లో రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సహా సీనియర్ పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా నేతలు మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విధానాలపై మండిపడ్డారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు అవకాశం కల్పించారని, ఈసారి బీజేపీకి అవకాశం ఇస్తే జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పదేండ్లు బీఆర్ఎస్, రెండేండ్లుగా కాంగ్రెస్ జూబ్లిహిల్స్ నియోజకవర్గాన్ని ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గడపగడపకూ తిరుగుతూ ఓటర్లకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను వివరించారు. ఆరు గ్యారంటీలు సహా ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు.

**ఎంఐఎం, కాంగ్రెస్ పొత్తుపై మండిపాటు**

అభ్యర్థిని నిలబెట్టకుండా కాంగ్రెస్‌తో ఎంఐఎం లోపాయికారీ ఒప్పందంపై నేతలు మండిపడ్డారు. అధికారంలో ఎవరుంటే వారితో కలిసిపోతూ హైదరాబాద్ అభివృద్ధిని ఎంఐఎం అడ్డుకుంటుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, ఎంఐఎం అనైతిక పొత్తుతో ఎదురయ్యే సమస్యలను వివరించారు. రౌడీషీటర్లను ప్రోత్సహిస్తూ, కబ్జాలకు పాల్పడే వ్యక్తులకు ఈ రెండు పార్టీలు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల పోటీలో లేకుండానే జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పెత్తనం అంతా ఎంఐఎం చేస్తుందని ఆరోపించారు.

**అభివృద్ధి హామీలతో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి**

నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సమస్యలను పరిష్కరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. గుండాయిజం, కబ్జాలు, రౌడీషీటర్ల నుంచి రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకారంతో జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోడ్డు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని, అవసరమైన చోట బస్తీ దవాఖానాల ఏర్పాటు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు ఆరా తీస్తూ కమలం గుర్తుకు ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ నేతలు ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

- 8వ పే కమిషన్ టీఓఆర్‌కు క్యాబినెట్ పచ్చజెండా
- జీతాలు, పెన్షన్లు పెంచేందుకు వీలుగా వేతన సంఘం ఏర్పాటు

**ఢిల్లీ, మహా:** లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల అలవెన్సులు, పెన్షన్లను సవరించే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 8వ కేంద్ర పే కమిషన్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కమిషన్‌లో ఎవరెవరు ఉండాలి? ఉద్దేశం, టైమ్‌లైన్‌ను ఖరారు చేసినట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ధృవీకరించారు. కొత్త వేతనాలు 2026 జనవరి నుంచి అమలులోనికి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వంలోని 48 లక్షల మంది ఉద్యోగులకు, 67 మంది పెన్షనర్లకు ఇవి లబ్ధి కలిగించనున్నాయి. వివిధ రాష్ట్రాల పీఆర్సీలను సైతం ఇవి ప్రభావితం చేయనున్నాయి. గత ఏడవ సీపీసీ 2016లో అమలు చేశారు. అప్పటి నుంచి ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, వినిమయ ధోరణలు గణనీయంగా మారిపోయాయి. దీంతో వేతనాలు సవరించాలని చాలా కాలం నుంచి ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**18 నెలల్లో నివేదికను ఇవ్వనుంది..**

ప్రస్తుత వేతన స్లాబులు, అలవెన్స్, గ్రేడ్ పే వ్యవస్థలు, పెన్షన్ ఫార్ములాలు, ఇతర ఆర్థిక విషయాలపై కమిషన్ పరిశీలన జరుపుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. సూక్ష్మ ఆర్థిక వాస్తవాలు, విత్త పరిగణనలు, ఉద్యోగాల కోసం నెలకొన్న పోటీ తదితరాలను కూడా కమిషన్ పరిశీలిస్తుందని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 7వ వేతన సంఘం కాలపరిమితి 2026 సంవత్సరంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త వేతన సవరణలను అమలు చేసేందుకై 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర సిద్ధమైంది. దీనిపై జనవరి నెలలోనే కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. కేంద్ర మంత్రులు, మంత్రిత్వ శాఖలు, అధికారులతో చర్చోపచర్చల అనంతరం 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ప్రభుత్వం. ఈ కమిషన్ తన నివేదికను 18 నెలల్లో ఇవ్వనుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం

## మహాగర్‌బంధన్ మ్యానిఫెస్టో

**పాట్నా, మహా:** బీహార్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలో విపక్ష కూటమి మహాగర్‌బంధన్ మ్యానిఫెస్టో విడుదల చేసింది. 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో ఈ మ్యానిఫెస్టోను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేడా తదితరుల సమక్షంలో విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలు ఇందులో పేర్కొన్నారు. బీహార్‌ను అభివృద్ధిపథంలో నడిపించడంతోపాటు దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా తేజస్వీ యాదవ్ వెల్లడించారు.




# అమెజాన్‌లో 30 వేల మంది ఔట్

## 2022 తర్వాత తొలగింపు ఇదే అత్యధికం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు అంత మంది అవసరం లేకపోవడంతో ఉద్యోగాల్లో కోత పెట్టేందుకు, పనిలోపనిగా ఖర్చులు తగ్గించుకునేందుకు అమెజాన్ సిద్ధమైందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 15లక్షలకుపైగా ఉద్యోగులు ఉన్న అమెజాన్ కంపెనీలో 3.50 లక్షల మంది కార్పొరేట్ ఎంప్లాయీస్ ఉన్నారు. వారిలో సుమారుగా పదిశాతం మందిని తొలగించేందుకు రంగం సిద్ధమైందని చెబుతున్నారు. అమెజాన్ ఇంత పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించడం 2022 తర్వాత ఇదే మొదటిసారి. ఆ సమయంలో సుమారు 27 వేల మందిని అమెజాన్ తొలగించింది. దీనిపై స్పందించేందుకు అమెజాన్ అధికార ప్రతినిధి నిరాకరించారు. డివైసెస్, కమ్యూనికేషన్స్, పాడ్‌కాస్టింగ్ సహా వివిధ రంగాల్లో చిన్న చిన్న సంఖ్యల్లో ఉద్యోగులను అమెజాన్ గత రెండేళ్లుగా తొలగిస్తూ వస్తున్నది. తాజాగా చేపట్టిన తొలగింపులతో మానవ వనరులు (పీపుల్ ఎక్స్‌పీరియన్స్ టెక్నాలజీ లేదా పీఎక్స్‌టీ), అమెజాన్ వెబ్‌సర్వీసెస్ వంటి రంగాల్లో కొంత ప్రభావం కనిపిస్తుందనే అభిప్రాయాలను ఈ విషయంలో సమాచారం ఉన్న వారు చెబుతున్నారు.

# తుమ్మిడిహట్టి టు సుందిళ్ళకు 80 టీఎంసీలు

## తరలించేందుకు వీలుగా ప్రాజెక్టు నిర్మాణం

సీఎం రేవంత్ కీలక నిర్ణయం.. నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్ష



(మొదటిపేజీ తరువాయి)

నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జల శక్తి మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించిన ముఖ్యమంత్రి, అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారిగా సమగ్రమైన వివరాలతో విశ్లేషణలు జరగాలని, రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని ఆదేశాలిచ్చారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు చెప్పారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్ణయించారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సమీక్షలో చర్చించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీరు, తాగునీరు అందించే విధంగా ఈ ప్రణాళికలు సిద్ధం కావాలని చెప్పారు. ఇందుకు పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లేందుకు వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. సుందిళ్లను మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# హరీశ్‌రావుకు పితృ వియోగం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నేతల సందర్శన అనంతరం ఫిల్మ్‌నగర్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల బీఆర్ఎస్ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

**బావతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న కేసీఆర్..**

హరీశ్‌రావు తండ్రి, కేసీఆర్ బావ (7వ సోదరి, అక్క లక్ష్మి భర్త) తన్నీరు సత్యనారాయణ మృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. వారి ఇద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే హరీశ్‌రావుకు కేసీఆర్ ఫోన్ చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మృతి పట్ల రెండు రాష్ట్రాల సీఎంలు సంతాపం..**

తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. హరీశ్‌రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సంతాపం తెలిపిన కవిత.. ప్రముఖులు..**

సత్యనారాయణరావు మృతి పట్ల కవిత సంతాపం తెలిపారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని పార్థించారు. హరీశ్‌రావు కుటుంబ



సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ మృతి పట్ల డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతాపం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. హరీశ్‌రావు తండ్రి మృతిపట్ల మంత్రులు సంతాపం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం సత్యనారాయణ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. సత్యనారాయణ పార్థివదేహానికి ఎంపీ రఘునందన్‌రావు నివాళి అర్పించారు. హరీశ్‌రావు నివాసానికి వెళ్లిన పలువురు బీఆర్ఎస్ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మరోవైపు హరీశ్‌రావు నివాసానికి వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆయన తండ్రి పార్థివదేహానికి నివాళి అర్పించారు. అలాగే పలువురు బీజేపీ ఎంపీలు ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వరరెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు పరామర్శించారు.

**ప్రచార కార్యక్రమాలు రద్దు..**

మంగళశారం బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమాలు రద్దు చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం, మంగళవారం బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమాల రద్దు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ పాడెను కేటీఆర్ మోయగా, పక్కనే ఉన్న పాలమూరు జిల్లాలోనే ఉన్న కవిత చివరిచూపుకు కూడా దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

# కాంగ్రెస్ దే జోరు

## నవీన్ యాదవ్ కే మొగ్గు ఖరారు

### ఏఎన్ఎన్ మహా పోల్ లో తేల్చేసిన పబ్లిక్.. ఏకంగా 59వేల మంది ఓట్లేసి అభిప్రాయం





**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కనబడుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయఢంకా మోగించబోతున్నాడని ప్రజాభిప్రాయం స్పష్టంగా కనబడుతోంది. మరో మూడేళ్ళకు పైగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, అభ్యర్థి లోకల్ , వీటికితోడు ముఖ్యమంత్రి రేవంత్.. కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులో ఉంటారన్న భావన ప్రజల్లో నెలకొనడం మొగ్గుచూపడానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు. ఎఎన్ఎన్ ఛానల్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మీ ఓటు ఎవరికి వేస్తారు అంటూ పోల్ నిర్వహించగా, ఇందులో రికార్డుస్థాయిలో 59వేల మంది పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని 55 శాతం మంది అభిప్రాయ పడగా, 36 శాతం మాగంటి సునిత గెలుస్తారని, 8 శాతం మంది బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి గెలుస్తారని తీర్పునిచ్చారు.

**నవీన్ యాదవ్ - 55 శాతం**

**మాగంటి సునిత - 36 శాతం**

**లంకల దీపక్ రెడ్డి - 8 శాతం**

**కవిత జనం బాటపై**

కవిత జనం బాట విజయవంతమవుతుందా అంటే అవుతుందని 25 శాతం, కాదని 67 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఏపీలో ట్రెండింగ్ లో ఉన్న పార్టీ ఏదన్న అంశంపై అధికార టీడీపీ, వైసీపీకి పోటాపోటీగా మద్దతు పలికారు. వైసీపీకి 41 శాతం, టీడీపీకి 39 శాతం మంది మొగ్గు చూపగా, కూటమిలోని మిగతా పార్టీలకు ఇతర మొగ్గు కనిపించింది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలోకి రేవంత్ , కేసీఆర్ రావాలని.. ప్రచారం చేయాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు.

# కవిత ఎవరు.. జాగృతి ఏంటి..?

## జాగృతి జనం బాట యాత్ర తీహార్ జైలుకు వెళ్తుంది

### మీ వేధింపుల భయానికి గతంలో కాంట్రాక్టర్లు పారిపోలేదా?

### కవితపై ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి విమర్శలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై ఎంపీ అరవింద్ మరోసారి ఫైర్ అయ్యారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో కవిత నడుస్తోందని ఆరోపించారు. అసలు కవిత ఎవరు..? జాగృతి ఏంటి..? అని ప్రశ్నించారు. కవిత వేధింపుల భయానికి గతంలో కాంట్రాక్టర్లు పారిపోయారన్నారు. జాగృతి జనం బాట యాత్ర తీహార్ జైలుకు వెళ్తుందని.. మూడు నాలుగు సంవత్సరాల తర్వాత కవిత అనుకున్న ఆశయం నెరవేరుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఫీజు రియంబర్స్‌మెంటు ఆపింది ఎవరు? అని ప్రశ్నించారు. అణగారిన వర్గాల విద్యార్థులు ఎదగొద్దు అనే కుటిల ఆలోచనతో కల్వకుంట్ల కుటుంబానిదని ఆరోపించారు. అణగారిన ప్రజలు బాగుపడితే జీర్ణించుకోలేని దౌర్భాగ్యులు మీరని విమర్శించారు. ఒక జనరేషన్ మొత్తాన్ని అణగదొక్కింది కల్వకుంట్ల కుటుంబం.. ఎమ్మెల్సీ కవిత రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మెన్ కు బీజేపీ తరపున లేఖ పంపిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డికి కవితకు ములాఖత్ ఏంటి..? ఎందుకు రాజీనామా ఆమోదించటం లేరు..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కవితతో పార్టీ పెట్టించే ప్రయత్నం చేస్తున్నారని.. ఇద్దరు ఒక్కటే.. ఇద్దరు బిజినెస్ పార్ట నర్లని విమర్శించారు. ప్రజలు పిచ్చోళ్లు కాదు, అన్ని గమనిస్తున్నారని ఎంపీ అరవింద్ తెలిపారు.

# ఆరు గ్యారంటీలు అట్టర్ ఫ్లాప్

### కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతికి కేరాఫ్.. బీజేపీకో జితావో.. జూబ్లీహిల్స్ కో బచావో

### జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎంపీ డీకే అరుణ హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** భవిష్యత్ అభివృద్ధి కావాలంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకే ఓటేయాలని ఆ పార్టీ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. ఉప ఎన్నికల్లో భాగంగా బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా జవహర్ నగర్‌లో ఎంపీ డీకే అరుణ క్యాంపెయినింగ్ నిర్వహించారు. మొదట డప్పు చప్పుళ్లు, జై బీజేపీ నినాదాలతో గ్రాండ్ వెల్కమ్ చెప్పారు స్థానిక బీజేపీ శ్రేణులు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, దమ్ముంటే జనాల్లోకి రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కాలం చెల్లినట్లే.. గత పదేళ్లు అధికారం ఇస్తే బీఆరెస్ చేసిందేమీ లేదు.. ఇక ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజల్ని దోచుకుని మభ్యపెడుతన్న కాంగ్రెస్, బీఆరెస్ లకు ఓట్లడిగే హక్కేలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అవినీతి అంతం జూబ్లీహిల్స్ నుంచే మొదలు పెడదామని కామెంట్స్ చేశారు. బీజేపీ అభ్యర్థిపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. 'మైనార్టీలు ఓట్లుంటే.. కాంగ్రెస్‌కు కలిసొచ్చినట్లేనా..? ప్రజలు ఆలోచిస్తున్నారు.. చెప్పిందల్లా నమ్మే పరిస్థితి లేదు. మీరేం చేయలేరని వారికీ అర్థమైంది. జూబ్లీహిల్స్ లో హిందువులంతా ఏకమవ్వాల్సిన సమయంఆసన్నమైంది. ఎవరెన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుపును ఆపలేరు. కాంగ్రెస్ అభ్యర్థి గురించి అందిరికీ తెలిసిందే. బీఆరెస్ కు ఓటేసినా ఫలితమే లేదు. అందుకే జూబ్లీహిల్స్ ప్రజలారా జర సోచో.. బీజేపీకో జితావో.. జూబ్లీహిల్స్ కో బచావో' అంటూ వ్యాఖ్యానించారు.

**రొట్టెలు కాల్చిన డీకే అరుణ..**

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో డీకే అరుణ తనదైన మార్క్ కనబరిచారు. బీజేపీ నాయకురాలు బండారు విజయలక్ష్మి, స్థానిక బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి అందరి దృష్టిని ఆకర్షించేలా ప్రజలతో మమేకమయ్యారు. ప్రచారంలో భాగంగా జవహర్ నగర్ లోని రోడ్డుపై జొన్న రొట్టెలు అమ్ముతున్న మహిళతో మాటామంతి చేశారు. స్వయంగా రొట్టెలు కాల్చి బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటేయాలని అభ్యర్థించారు.

# భారీగా తగ్గిన బంగారం ధరలు

### ట్రంప్ - చైనా చర్చల ఎఫెక్ట్

**హైదరాబాద్ , మహా :** ఒక రేంజ్ లో పైకి దూసుకుపోయిన బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. ఒక్కరోజే గంటల వ్యవధిలో రెండుసార్లు గోల్డ్ రేట్స్ బాగా పడిపోయాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం మీద రూ.2560 తగ్గి రూ.1,20,820కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారంపై రూ.2,250 తగ్గి రూ.1,10,750కి చేరింది. మరోవైపు కేజీ వెండి ధర ఏకంగా రూ.5 వేలు తగ్గి రూ.1,65,000 కు చేరింది. కాగా అమెరికా చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ తగ్గుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో బంగారానికి డిమాండ్ తగ్గినట్లు అంచనా వేస్తున్నారు.

# దండుపాళ్యం బ్యాచ్ అంటే దంచికొడతాం

### బోరబండ డివిజన్‌లో సీతక్క విస్తృత ప్రచారం

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. ఆమెకు అప్పగించిన బోరబండ డివిజన్‌లో మంగళవారం పర్యటిస్తూ ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ (BRS) అబద్ధపు ప్రచారానికి తెరదించాల్సిన సమయం వచ్చిందని సీతక్క వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో ఉన్న రౌడీ షీటర్లు ఇప్పుడు మంచివాళ్లుగా మారిపోయారా? అని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై పదే పదే రౌడీ షీటర్ అన్న ముద్ర వేయడం సరికాదని ఆమె స్పష్టం చేశారు. నవీన్ యాదవ్ పక్కా లోకల్ నాయకుడు, ఆయన గెలుపును ఎవ్వరూ ఆపలేరని ఆమె వ్యాఖ్యానించారు. "పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏమి సాధించలేకపోయారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది. ఇకపై మా కేబినెట్‌ను 'దండుపాళ్యం బ్యాచ్' అని పిలిస్తే ఊరుకోం.. గట్టిగా సమాధానం ఇస్తాం" అని సీతక్క హెచ్చరించారు. ఇక మరోవైపు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని పూర్తిస్థాయిలో వేగవంతం చేసింది. నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా మంత్రులు, ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించగా, వారు పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాల ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించనున్నారు.



# నయనతార .. ఆల్ టైమ్ రికార్డ్

### చేతిలో 9 సినిమాలు

**మహా:** 40 ప్లస్ వయసులోనూ నయనతార అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నారు. దక్షిణ భారత సినీ పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నాయికల్లో ఆమె ఒకరు. ఇటీవల మెగాస్టార్ చిరంజీవితో అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో నటిస్తున్న నయనతార, ఈ సినిమా కోసం ఏకంగా 18 కోట్ల రూపాయల పారితోషికం డిమాండ్ చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. నయన్ క్రేజ్‌కి నిదర్శనంగా, ఆమె చేతిలో ప్రస్తుతం దాదాపు 9 సినిమాలు ఉన్నట్లు సమాచారం. అందులో తమిళంలో 4, మలయాళంలో 2, తెలుగులో (చిరు సినిమాతో కలిపి) 2, కన్నడలో 1 సినిమా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక నాలుగోసారి బాలయ్యకు జోడీగా నయనతార తెరపై కనిపిస్తే, పది సినిమాలు ఉన్నట్లు అవుతుంది. నయనతార ఎన్నడూలేని రీతిలో చిరుమూవీ ప్రమోషన్స్ లో కూడా పాల్గొంటున్నారు.

# మావోయిస్ట్ పార్టీకి మరో ఎదురు దెబ్బ

### లొంగిపోయిన కీలక నేతలు బండి ప్రకాశ్, చంద్రన్న



**హైదరాబాద్, మహా:** మావోయిస్ట్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ కీలక నేత బండి ప్రకాశ్ లొంగిపోయారు. ఆయనతో పాటు మరో మావోయిస్టు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సైతం లొంగిపోయారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో బండి ప్రకాశ్‌తో కలిసి పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న బండి ప్రకాశ్, మావోయిస్టు పార్టీలో 45 సంవత్సరాలు వివిధ స్థాయిల్లో పని చేశారు. ప్రభాత్ అనే పేరుతో ప్రెస్టమ్ ఇన్చార్జిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో మావోయిస్టులు లొంగిపోయారు**

మావోయిస్టుల లొంగుబాటు వివరాలను తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. మావోయిస్టు నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ 45 సంవత్సరాలు వివిధ స్థాయిల్లో పని చేశారని తెలిపారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి అని, ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారని, 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారని తెలిపారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారని, నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. 1980లో మావోయిస్టు మరో నేత పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారని డీజీపీ తెలిపారు. 1981లో పీపుల్స్ వార్‌లో చేరి 1983లో కమాండర్ అయ్యారని, 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పని చేశారని చెప్పారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు అయ్యారని, 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని వివరించారు.

# ప్రశాంత్ కిషోర్‌కు ఈసీ షాక్

### రెండు రాష్ట్రాల్లో ఓట్లు.. ఈసీ నోటీసులు.. ఎన్నికల వేళ చిక్కుల్లో జన్ సురాజ్ పార్టీ చీఫ్



**బీహార్, మహా:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ రెండు రాష్ట్రాల్లో ఓటరుగా ఉన్నారు. ఒక ఓటు బీహార్‌లో ఉండగా.. మరో ఓటు పశ్చిమబెంగాల్‌లో ఉంది. ఎన్నికల అధికారులు మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఇది ఇప్పుడు ప్రశాంత్ కిషోర్‌ను చిక్కుల్లో పడేసింది. ప్రశాంత్ కిషోర్ కోల్‌కతాలోని భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా ఉన్నారు. అది పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి సొంత నియోజకవర్గం. నియోజవర్గంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని ఆయన అడ్రస్‌గా పేర్కొన్నారు. బీ రాణీశంకరీ రోడ్‌లోని సెయింట్ హెలెన్ పోలింగ్ స్టేషన్‌లో ఆయనకు ఓటు ఉందని అధికారులు తెలిపారు. 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రశాంత్ కిషోర్ తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యూహకర్తగా పనిచేశారు. అప్పుడే ఆయన ఓటరుగా నమోదయ్యారు. ఇక బీహార్లోని ససారామ్ నియోజకవర్గంలో కూడా ప్రశాంత్ కిషోర్ ఓటరుగా ఉన్నారు. కోనార్‌లోని మధ్య విద్యాలయ పోలింగ్ కేంద్రంలో ఆయనకు ఓటు ఉందని అధికారులు వెల్లడించారు.

# డిసిసి పదవిలో మున్నూరు కాపులకు సమచిత స్థానం కల్పించాలి

### పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి వినతి పత్రాన్ని అందజేసిన మున్నూరు కాపు నేతలు

**హైదరాబాద్, మహా:** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి బీసీ లకు కేటాయించాలని కోరుతూ మంగళవారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసి మున్నూరు కాపులకు సముచిత స్థానాన్ని కల్పించాలని కోరుతూ తెలంగాణ మున్నూరు కాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ జగిత్యాల మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చెదలు సత్యనారాయణ మున్నూరు కాపు నేతలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు తెలంగాణ రాష్ట్రంలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీకీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎంపికకు కూడా బీసీలకు 42 శాతం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ మున్నూరు కాపులకు కూడా సమచిత స్థానం కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లాలో మున్నూరు కాపులు అధిక సంఖ్యలో ఉన్నారు కావున జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మున్నూరు కాపు చెదలు సత్యనారాయణకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నామన్నారు



# మూడోసారి పోటీచేస్తా..

### డొనాల్డ్ ట్రంప్ సంచలనం


### పోటీకి అనేకమార్గాలు

**మహా:** రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. తనశైలిలో నిర్ణయాలు తీసుకుంటూ ఇప్పటికే రాజకీయ రంగంలో చర్చనీయాంశంగా మారిన ట్రంప్, ఇప్పుడు మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు సంకేతాలిచ్చారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం రెండు సార్లు మాత్రమే అధ్యక్ష పదవికి అవకాశం ఉన్నప్పటికీ, మూడోసారి పోటీ చేయాలనే ఆలోచనకు మార్గాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. మలేసియా పర్యటన అనంతరం టోక్యో వెళ్తుండగా ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ మాట్లాడుతూ, "2028లో మూడోసారి పోటీ చేయమని స్టీవ్ బానన్ సూచించారు. నేను దానిని ఇష్టపడతాను. నా వద్ద అత్యుత్తమ రికార్డులు ఉన్నాయి" అని అన్నారు. అయితే వెంటనే దాని గురించి నేను ఇంకా సీరియస్‌గా ఆలోచించలేదని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ అభివృద్ధి బాధ్యత మాదే

### బీఆర్ఎస్ వారి నాయకుల అభివృద్ధి కోసమే పని చేసింది


### డోర్ టు డోర్ క్యాంపెనింగ్‌లో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మహా:** రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని కార్మిక, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా గడపగడప ప్రచారంలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్‌లోని బాలాజీ నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ సమస్యలు, రోడ్ల దెబ్బతినడం, కాలువలు మూసుకుపోవడం వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయిందని విమర్శించారు. ప్రజల అభివృద్ధి కోసం కాకుండా, వారి నాయకుల అభివృద్ధి కోసం మాత్రమే పనిచేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. మాటల గారడీతో ప్రజలను మోసం చేసిన ఆ పాలనను ప్రజలు విస్మరించారని తెలిపారు. మీ నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుంది అని మంత్రి భరోసానిచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందని వివరించారు. మహిళల స్వయం సహాయక సమూహాల ద్వారా కోటీశ్వరులుగా మారే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. నవంబర్ 11న జరగబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, తద్వారా నియోజకవర్గ అభివృద్ధికి బలం చేకూరుతుంది అని మంత్రి వివేక్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# అధికారులు.. బీ అలెర్ట్

- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తొద్దు
- తుపానుల నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి
- జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనాపై ఫోకస్ పెట్టాలి
- మొంథా తుపానుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష




**అమరావతి, మహా:** మొంథా తుపాను ప్రభావంపై మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాణనష్టం లేకుండా ఆస్తినష్టం ఎక్కువ జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాసం, నష్టం అంచనా అనే అంశాలపై అధికారులు ఫోకస్ పెట్టాలన్నారు. కాల్వలు, చెరువులకు గండిపడకుండా చూడాలని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండండని తెలిపారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించాలని అలానే అక్కడ వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అందువల్ల అలెర్టుగా ఉండాలని సీఎం ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పని చేయాలని సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో ఇరువురూ క్షేత్రస్థాయిలో ఉంటే ప్రజలకు భరోసా ఇచ్చినట్టు అవుతుందని సూచించారు. భారీ వర్షాల వల్ల నీరు నిల్వ ఉండకుండా కాలువలు, డ్రైన్ల ద్వారా నీటిని బయటకు పంప్ చేయాలని సూచించారు. విజయవాడ, ఏలూరు, భీమవరం వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం అనేది ఉండకూడదని సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లా కలెక్టర్లు ప్రతి గంటకూ బులెటిన్ రిలీజ్ చేయాలని మీడియాకు వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం సూచించారు. తప్పుడు సమాచారం, ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసే వార్తలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని రైతులకు తుపాను అలెర్టులు ఎప్పటికప్పుడు చేరేలా చూడాలని ఆదేశించారు.

పంట నష్టంపై ప్రాథమిక, పూర్తి స్థాయి అంచనాలను రూపొందించుకునే దిశగా దృష్టి పెట్టాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసుకుని జాతీయ రహదారులపై రాకపోకలను నిలపాలని, ఒకవేళ నిలపాల్సి పరిస్థితే వస్తే ముందుగానే సమాచారం అందివ్వాలని సీఎం తెలిపారు. అంతకు ముందు మొంథా తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ నుంచి సమీక్షించారు. ప్రస్తుతం తుపాను తీరానికి దగ్గరగా వస్తోందని, కోస్తాంధ్ర జిల్లాలపై దీని ప్రభావం ప్రారంభమైందని అధికారులు వెల్లడించారు. కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఉందని చెప్పారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. గతంలో వచ్చిన తుపానుల నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే కాకినాడ, ఆ పరిసర ప్రాంతాలకు రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అండగా ఉండాలి: తుపాను ప్రభావిత ప్రాంతాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మొంథా తుపాను రాష్ట్రంపై ప్రభావం చూపుతుందన్నారు. ఎన్డీయే కూటమి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను నేపథ్యంలో నేడు, రేపు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. లీడర్ నుంచి కేడర్ వరకు ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. తుపాను ప్రభావంతో కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.

## ద్రాక్షారామం

ద్రాక్షారామంలోని భీమేశ్వర ఆలయం సాంప్రదాయకంగా చాళుక్య భీమ I కి చెందినదిగా చెప్పబడుతోంది. అయితే దీనికి శిలాశాసన మద్దతు లేదు. అమ్మ2 (945–970 సీఈ) పాలన నాటి ఒక శాసనం కుప్పనార్య అనే అధికారి గురించి ప్రస్తావిస్తుంది. అతను ద్రాక్షారామంలో కుప్పేశ్వర అనే శివాలయాన్ని నిర్మించాడు. అయితే ఆ పేరుతో ఇప్పుడు ఆలయం లేదు. 1081 సీఈ నాటి భీమేశ్వర ఆలయంలోని తొలి శాసనం ఈ కాలానికి ముందు దాని ఉనికిని సూచిస్తుంది. 982 సీఈ నాటి మరొక శాసనం ఈ ఆలయాన్ని ప్రస్తావిస్తుంది. ఇది 10వ శతాబ్దం ప్రారంభంలో బహుశా కుప్పనార్య కాలంలో నిర్మించబడిందని సూచిస్తుంది. రాముడు ఇక్కడ శివుడిని, తరువాత సూర్యుడిని, ఇంద్రుడిని పూజించాడని నమ్ముతారు. 18 శక్తి పీఠాలలో ఒకరైన మాణిక్యమాబా దేవి ఇక్కడ ఉంది.



# పవిత్ర పంచారామ ఆలయాల చరిత్ర ఇదే

కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాల దర్శనం చాలా విశిష్టమైనది. ఎందుకంటే ఈ సమయంలో శివుడిని పూజించడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్మకం. ఈ మాసంలో పంచారామ క్షేత్రాలను తెలుగురాష్ట్రాల భక్తులు వేలాదిగా పందర్శిస్తారు. ఈ పుణ్యక్షేత్రాలు భక్తుల రాకతో కిటకిటలాడుతుంటాయి. పంచారామాలు అనేవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శివుడికి అంకితం చేయబడిన ఐదు పురాతన హిందూ దేవాలయాల సమూహం. ఈ ఆలయాలు ద్రాక్షారామం, సామర్లకోట, అమరావతి, పాలకొల్లు, భీమవరంలో ఉన్నాయి. ప్రాంతీయ పురాణాల ప్రకారం.. ఈ ఆలయాలలోని లింగాలను, అరమాలుగా సూచిస్తారు. ఒకే ఏకీకృత శివలింగం నుండి సృష్టించబడ్డాయని నమ్ముతారు. పంచారామ ఆలయాల స్థాపనను ఇంద్రుడు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ శైవక్షేత్రాలను శివుడికి ప్రీతిపాత్రమైన మాసంలో పెద్దసంఖ్యలో భక్తులు సందర్శిస్తారు. ఇదీ పంచారామ క్షేత్రాల విశిష్టత. కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాల దర్శనం చాలా విశిష్టమైనది. ఎందుకంటే ఈ సమయంలో శివుడిని పూజించడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్మకం. ఈ ఐదు పవిత్ర క్షేత్రాలలో (ద్రాక్షారామం, సామల్‌కోట, అమరావతి, పాలకొల్లు, భీమవరం) ఒక్కరోజులో దర్శనం చేస్తే ప్రత్యేక ఫలితం ఉంటుందని భక్తులు భావిస్తారు. కార్తీక మాసంలో భక్తులు ఉదయమే నిద్రలేచి స్నానాలు చేసి, దీపారాధనలు చేస్తారు, ఈ సమయంలో పంచారామాలను దర్శించడం వల్ల శివుడి అనుగ్రహం పొందుతారు.

- మహా డెస్క్

**పంచారామ క్షేత్రాలు:** ఇవి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఐదు పురాతన శివాలయాలు.
**క్షేత్రాలు:** ద్రాక్షారామం, సామర్ల కోట, అమరావతి, పాలకొల్లు, భీమవరం.
**పవిత్రత:** కార్తీక మాసంలో ఈ క్షేత్రాలను ఒక్కరోజులో దర్శనం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని నమ్మకం.

## అమరావతి

అమరావతిలోని అమరేశ్వర ఆలయాన్ని శిలాశాసనం, చారిత్రక ఆధారాల ఆధారంగా, దాని గోడలపై ఉన్న 35 శాసనాలలో మొట్టమొదటిది 1129 సీఈ నాటిది. దాని ద్రావిడ నిర్మాణ శైలి 10వ శతాబ్దపు సామర్లకోట, ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాలను పోలి ఉన్నప్పటికీ, మునుపటి శాసనాలు లేకపోవడం వల్ల ఆలయం తరువాత నిర్మించబడిందని సూచిస్తుంది. ఈ ఆలయం 11వ శతాబ్దంలో ఉద్భవించిందని పండితులు అంచనా వేస్తున్నారు. కాలక్రమేణా, భీమేశ్వర ఆలయాలతో సంబంధం ఉన్న ఇతిహాసాలు వాటిని అమరేశ్వర ఆలయంతో అనుసంధానించి ఉండవచ్చు. అమరావతి గుంటూరు జిల్లాలో, కృష్ణా నది ఒడ్డున ఉంది. ఇక్కడ ఇంద్రుడు అమర లింగేశ్వరుడిని పూజించాడని నమ్ముతారు.






## క్షీరారామ (పాలకొల్లు)

పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర ఆలయం సాంప్రదాయకంగా నరేంద్ర మృగరాజు (విజయాదిత్య)తో ముడిపడి ఉంది. ఎడారుపల్లి రాగి ఫలకం గ్రాంట్ ప్రకారం 108 యుద్ధాలు చేసి శివాలయాన్ని నిర్మించాడు. పంచరామ మందిరాలలో భాగమైన ఈ ఆలయం, సాధారణ రెండు అంతస్తుల మందిరాలకు భిన్నంగా, ఒక చిన్న లింగంతో కూడిన ఒకే అంతస్తుల నిర్మాణం. ఆలయంపై ఉన్న నలభై ఆరు శాసనాలలో తొలిది 1156 సీఈ నాటిది. తాజాది 1640 సీఈలో నమోదు చేయబడింది. శిలాశాసన ఆధారాల ఆధారంగా ఈ ఆలయం 11వ శతాబ్దం సీఈలో నిర్మించబడిందని నమ్ముతారు. స్థానిక పురాణం ప్రకారం. క్షీర రామ లింగేశ్వరుడు ఇక్కడ విష్ణువుకు సుదర్శన చక్రాన్ని సమర్పించాడు. ఓ మహర్షి శివుడి నుంచి వరాలు, పాలు పొందాడు. అందుకే దీనికి క్షీర (పాలు) అనే పేరు వచ్చింది.

## కుమారరామ (సామర్లకోట)

సామర్లకోటలోని భీమేశ్వర ఆలయం తూర్పు చాళుక్య రాజు చాళుక్య భీమ I (888–918 సీఈ)కు ఆపాదించబడింది. ఈ ఆలయం సామర్లకోటకు దగ్గరగా చాళుక్య భీమవరం సమీపంలో ఉంది. పిఠాపురంలో లభించిన ఒక శాసనం చాళుక్య భీముడిని దీని నిర్మాణ ఘనతగా పేర్కొంటుంది. అతను 30 సంవత్సరాలు పరిపాలించిన విక్రమాదిత్య కుమారుడిగా వర్ణించబడ్డాడు. 360 యుద్ధాలను గెలిచాడని చెబుతారు. కొంతమంది పండితులు చాళుక్య భీమ II (934–945 సీఈ) ఆలయ నిర్మాణానికి బాధ్యత వహించవచ్చని ప్రతిపాదించినప్పటికీ, చాలా ఆధారాలు చాళుక్య భీమ 1 ను దాని స్థాపకుడిగా సమర్థిస్తున్నాయి. కుమార భీమేశ్వర స్వామి ఆలయం సామర్లకోటలో ఉంది. ఇది కాకినాడ నుండి దాదాపు 20 కి.మీ దూరంలో ఉంది. కార్తికేయుడు ఇక్కడ లింగాన్ని ప్రతిష్ఠించాడని భావిస్తారు. అందుకే దీనికి కుమారరామ అనే పేరు వచ్చింది.





## సోమారామ (భీమవరం)

భీమవరంలోని సోమేశ్వర ఆలయం తారకాసురుడి పురాణంతో ముడిపడి ఉంది. ఇక్కడ అతని మెడ నుంచి పడిపోయిన శివలింగ భాగాన్ని చంద్రుడు ప్రతిష్టించాడు. ఆలయంలో లభించిన తొలి శాసనం తూర్పు చాళుక్య రాజు శక్తివర్మ I (1001–1011 సీఈ) పాలన నాటిది. ఈ ఆలయ నిర్మాణం 10వ శతాబ్దంలో జరిగింది. అయితే, నిర్మాణ లక్షణాలు తరువాతి కాలంలో ఇది పునర్నిర్మాణాలకు గురైందని సూచిస్తున్నాయి. సోమేశ్వర స్వామి ఆలయం గునుపూడిలో ఉంది. ఈ ఆలయం ముందు చంద్ర కుండం అనే పవిత్ర చెరువు ఉంది. ఈ లింగం చంద్ర మాసం ప్రకారం అమావాస్య సమయంలో నలుపు, పూర్ణిమ సమయంలో తెలుపు రంగులోకి మారుతుంది. అన్నపూర్ణ మాత ఆలయం రెండవ అంతస్తులో ఉంది.




# ఎలాన్ మస్క్ మరో సంచలనం

ప్రపంచ అపరకుబేరుడు ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెర తీశారు. వికీపీడియాకు పోటీగా.. గ్రోకిపీడియా(Grokipedia)ను తీసుకొచ్చారు. ఇది ఏఐ ఆధారితంగా పని చేస్తుందని.. వికీపీడియా కంటే పది రేట్లు ఎంతో బెటర్ అంటూ ప్రకటించారు. ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ xAI గ్రోకిపీడియా(Grokipedia version 0.1) ప్లాట్‌ఫారమ్‌ను ఇవాళ(అక్టోబర్ 28న) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది Grokకు conversational AI మోడల్. వాస్తవాలను ఆధారంగా తీసుకుని.. శరవేగంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా సమాచారం అందించడం దీని ఉద్దేశమని మస్క్ అంటున్నారు. అయితే.. ఇది ప్రారంభమైన కాసేపటికే భారీ ట్రాఫిక్ కారణంగా క్రాష్ అయ్యింది.

దీంతో కాసేపటికి సేవల్ని పునరుద్ధరించారు. అంతేకాదు.. కొంత మంది ఇది వికీపీడియాతో పోలిస్తే కొత్తగా ఏం లేదని పెదవి విరుస్తున్నారు. పైగా ప్రాథమిక సమాచారాన్ని వికీపీడియా నుంచే తీసుకుంటోందని ఆరోపిస్తున్నారు. వికీపీడియాను జిమ్మీ వేల్స్ (Jimmy Wales), ల్యారీ సాంగర్ (Larry Sanger) కలిసి 2001 జనవరి 15న స్థాపించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన సమాచార వేదికలలో ఒకటి. ఇది ఒక ఫ్రీ ప్లాట్‌ఫారమ్. ఇందులో ఎవరైనా సమాచారాన్ని పొందుపరచవచ్చు.. లాగిన్ అయ్యి ఎడిట్ కూడా చేయొచ్చు. ఇది వికీమీడియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తోంది. అయితే.. వికీపీడియాకు పోటీగా, నిజమైన సమాచారం కోసం కొత్త వేదికలు అవసరం అంటూ మస్క్ చాలాకాలంగా చెబుతూ వస్తున్నారు. వికీపీడియాలోని సమాచారం విషయంలో స్పష్టత కొరవడింది. పూర్తిగా పక్షపాత ధోరణి కనిపిస్తోంది. అదే ఏఐతో అయితే అందుకు ఆస్కారం ఉండదని చెబుతూ ఇప్పుడు మస్క్ Grokipedia తీసుకొచ్చారు.

# మధ్యతరగతి వారికి వారెన్ బఫెట్ ఆర్థిక సూత్రాలు

ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన పెట్టుబడి దారుల్లో వారెన్ బఫెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా భారతదేశంలోని సాధారణ వేతన జీవులు ఆర్థికంగా ఎదగడానికి, సంపదను సృష్టించడానికి ఉపయోగపడే అత్యంత విలువైన, ఆచరణాత్మక ఆర్థిక సూత్రాలను సూచించారు.

### ముందుగా పొదుపు, తర్వాతే ఖర్చు

ప్రతినెల జీతం వచ్చిన వెంటనే ఖర్చులు పోగా మిగిలిన మొత్తాన్ని పొదుపు చేయడం కంటే ముందుగా పొదుపు చేయదలిచిన మొత్తాన్ని పక్కన పెట్టి ఆ తర్వాత మిగిలిన దానితో ఖర్చులను సరిపెట్టుకోవాలి. ఈ సూత్రం ద్వారా పొదుపుకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టవుతుంది. ఇది ఆర్థిక క్రమశిక్షణను పెంచుతుంది. మధ్యతరగతి వారికి ఇది ఒక బలమైన ఆర్థిక పునాదిని ఏర్పరుస్తుంది.

### అనవసరమైన రుణాలను నివారించడం

అధిక వడ్డీ రేట్లు ఉండే రుణాలకు (ముఖ్యంగా క్రెడిట్ కార్డు రుణాలు) దూరంగా ఉండాలి. ఎందుకంటే అవి సంపదను హరించివేస్తాయి. రుణాలను నివారించడం లేదా వీలైనంత త్వరగా వాటిని తీర్చేయడం ద్వారా వడ్డీ రూపంలో పోయే డబ్బు ఆదా అవుతుంది. దాన్ని పెట్టు



బడికి ఉపయోగించవచ్చు. ఇది సంపద సృష్టి వేగాన్ని పెంచుతుంది.

### దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడి

స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులకు భయపడకుండా బలమైన వ్యాపార నమూనా, మంచి నిర్వహణ ఉన్న కంపెనీలను ఎంచుకుని దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడి పెట్టాలి. స్వల్పకాలిక లాభాల కోసం వెంపర్లాడకుండా సహనంతో ఉంటే కాలక్రమేణా చక్రవడ్డీతో చిన్న పెట్టుబడులు కూడా భారీ మొత్తంగా మారతాయి. మధ్యతరగతి వారికి సంపద సృష్టిలో ఇది అత్యంత కీలకమైన సూత్రం.

### తెలిసిన వాటిలో మాత్రమే పెట్టుబడి పెట్టడం

మీకు పూర్తిగా అర్థం కాని లేదా అవగాహన లేని వ్యాపారాలు/పరిశ్రమలలో పెట్టుబడి పెట్టవద్దు. మధ్యతరగతి వారు నష్టాలను భరించే సామర్థ్యం తక్కువగా ఉంటుంది. అందుకే తాము అర్థం చేసుకోగలిగే, భవిష్యత్తులో వృద్ధి చెందే సామర్థ్యం ఉన్న వాటిలో మాత్రమే పెట్టుబడి పెట్టాలి.

### సాధారణ వేతన జీవులకు సలహాలు

ప్రతి నెల బడ్జెట్‌ను పాటించాలి. అవసరాలు, కోరికల మధ్య తేడాను గుర్తించి అనవసరమైన ఖర్చులను తగ్గించాలి. ధనవంతులుగా కనిపించడానికి లగ్జరీ వస్తువులు (పెద్ద ఇల్లు, ఖరీదైన కారు) కొనడానికి అప్పులు చేయవద్దు. విలువ తగ్గే ఆస్తులపై (ఉదా: కొత్త కారు) అధికంగా ఖర్చు పెట్టకుండా ఉండాలి. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, పుస్తకాలు చదవడం, జ్ఞానాన్ని నిరంతరం పెంచుకోవడం ద్వారా సంపాదన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలి. మంచి విద్య, నైపుణ్య శిక్షణ, నిరంతర అభ్యాసం ద్వారా ఉద్యోగంలో మెరుగైన స్థానం, అధిక జీతం పొందవచ్చు.

# ఏరో-ఇంజిన్ రాజధానిగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభించారు. గ్లోబల్ "ఏరోస్పేస్‌డిఫెన్స్ స్పేస్" హబ్ గా తెలంగాణ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం "సిటీ ఆఫ్ పెరల్స్" మాత్రమే కాదని, ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 202324లో రూ.15,900 కోట్లు ఉండగా, 202425 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే ₹30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ "న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ"లో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలు లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ టర్బైన్ షాఫ్ట్




(రోటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయన్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. "విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే దానిని తెలంగాణలో నిర్మించండి" అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపునిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక, తెలంగాణ ఏరోస్పేస్ & డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పీఏ తదితరులు పాల్గొన్నారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# రాజ్యాంగ విరుద్ధమైనా.. మళ్లీ నేనే!?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(79) తన మనసులోని మాట బయటపెట్టారా?. ముచ్చటగా మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ పడాలనుకుంటున్నారా?. జపాన్ పర్యటనకు ముందు ఆయన చేసిన వ్యాఖ్యల ఆంతర్యం అదేనంటూ చర్చ నడుస్తోంది ఇప్పుడు. వైట్‌హౌజ్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ తాజాగా ట్రంప్ మూడో దఫా పోటీపై ఆసక్తికర వ్యాఖ్య చేశారు. జపాన్ పర్యటనకు బయల్దేరే ముందు విమానం(Air Force One) వద్ద మీడియా ఆయన్ని ఆ వ్యాఖ్యలపై ప్రశ్నించింది. దానికి ట్రంప్ స్పందిస్తూ.. "మూడోసారి పోటీ చేయడం నాకు ఇష్టమే. నా వద్ద అత్యుత్తమ నెంబర్లు ఉన్నాయి" అంటూ బదులిచ్చారు. అయితే.. ఆ వెంటనే "ఇంకా ఆ విషయంపై నిజంగా ఆలోచించలేదు" అని అన్నారు. ట్రంప్ తన తరువాత రిపబ్లికన్ పార్టీని నడిపే నాయకులుగా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్లను ప్రస్తావించారు. మా వద్ద గొప్ప నాయకులు ఉన్నారు అంటూ రుబియో వైపు చూపిస్తూ.. 'వాళ్లలో ఒకరు ఇక్కడే ఉన్నారు' అని చమత్కరించారు. అలాగే.. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను ప్రశంసిస్తూ.. అవును, జేడీ అద్భుతంగా ఉన్నాడు. ఉపాధ్యక్షుడు గొప్పవాడు. వీళ్లిద్దరిని ఎదుర్కొనే వారు ఉండరేమో అని ట్రంప్ అన్నారు. అమెరికాకు అధ్యక్ష ఎన్నికలు 2028 సంవత్సరంలో జరగనున్నాయి. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. ఒక వ్యక్తి అధ్యక్ష పదవికి రెండుసార్లు మాత్రమే ఎన్నిక కావచ్చు. మూడోసారి పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధం. అయితే స్టీవ్ బానన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ట్రంప్ 2028లో మూడోసారి అధ్యక్షుడిగా అవుతారు. దీనికి ఒక ప్రణాళిక ఉంది. కఠినమైన అడ్డంకే ఉన్నా.. దాన్ని అధిగమించే మార్గాలు ఉన్నాయి. 2016, 2024లో ట్రంప్ సాధించారు. వచ్చేసారి కూడా సాధించగలరు అని అన్నారు. గతంలో ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ అమెరికాకు నాలుగు పర్యాయాలు అధ్యక్షుడిగా పని చేశారు. అయితే.. 1951లో రాజ్యాంగానికి 22వ సవరణ (22nd Amendment) ద్వారా రాటిఫై చేశారు. ట్రంప్ మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే, అమెరికా రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంటుంది. రాజ్యాంగ సవరణ చేయాలంటే, అత్యధిక రాష్ట్రాల ఆమోదం అవసరం. ఇది రాజకీయంగా చాలా కష్టమైన ప్రక్రియ. ఇది ప్రస్తుతం సాధ్యపడే అవకాశాలు లేవు. స్టీవ్ బానన్, ట్రంప్ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీసేలా ఉన్నా.. న్యాయపరంగా అవి అమలులోకి రావడం అసాధ్యం. ఇదిలా ఉండగా.. ఆసియా పర్యటనలో భాగంగా ట్రంప్ మలేషియా నుంచి జపాన్ చేరుకున్నారు. సోషల్ ట్రూత్‌లో ఈ మేరకు.. మలేషియా అద్భుతమైన దేశం. ముఖ్యమైన వాణిజ్య ఒప్పందాలు, రేర్ ఎర్త్ డీల్స్ సంతకం చేశాం. ముఖ్యంగా థాయ్‌లాండ్ మరియు కంబోడియా మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. యుద్ధం లేదు! కోట్లాది ప్రాణాలు రక్షించబడ్డాయి. ఇది చేయడం గౌరవంగా ఉంది. ఇప్పుడు జపాన్‌కు బయల్దేరా అని పోస్ట్ చేశారు.

# విమానంలో కలకలం

## ప్రయాణికులపై భారతీయ విద్యార్థి దాడి

లుఫ్తాన్సా విమానంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. విమానంలో ఓ భారతీయ విద్యార్థి.. తోటి ప్రయాణికులపై దాడి చేశాడు. పదునైన మెటల్ ఫోర్క్‌తో ఇద్దరు టీనేజర్లపై దాడికి పాల్పడ్డాడు. షికాగో నుంచి జర్మనీకి ప్రయాణిస్తున్న విమానంలో ఘటన జరిగింది. నిందితుడిని ప్రణీత్ కుమార్ ఉసిరిపల్లి(28)గా అధికారులు గుర్తించారు. ఈ ఘటనతో విమానంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రయాణికులు భయాందోళన చెందారు. ఈ హింసాత్మక ఘటన కారణంగా పైలట్లు విమానాన్ని బోస్టన్‌కు మళ్లించాల్సి వచ్చింది. అధికారుల సమాచారం మేరకు.. విమానం అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో ప్రణీత్ కుమార్.. 17 ఏళ్ల ఇద్దరు టీనేజర్లపై ఫోర్క్‌తో దాడి చేశాడు. మొదట నిద్రలో ఉన్న ఓ యువకుడి భుజంపై ఫోర్క్‌తో గాయపరిచాడు. అనంతరం మరో యువకుడిపై తల వెనుక భాగంలో గాయపరిచాడు. అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన విమాన సిబ్బందిపై కూడా దాడి చేశాడు. ఈ ఘటన అనంతరం లుఫ్తాన్సా ఫ్లైట్ 431 బోస్టన్ లోగన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యవసరంగా దారి మళ్లించారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ఫెడరల్ ఏజెంట్లు, పోలీసులు



విమానంలోకి ప్రవేశించి ప్రణీత్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన ఇద్దరు యువకులను ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనలో ప్రణీత్‌కు గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష, 2,50,000 డాలర్ల జరిమానా విధించవచ్చు. ప్రస్తుతం అతను ఫెడరల్ కస్టడీలో ఉన్నాడు. బోస్టన్‌లోని యూఎస్ జిల్లా కోర్టులో హాజరుపర్చనున్నారు. ప్రణిత్ కొన్ని సంవత్సరాల క్రితం విద్యార్థి వీసాతో అమెరికాలోకి ప్రవేశించాడు. వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అతడు అక్కడే ఉంటున్నట్లు సమాచారం.

# భజనలో.. గోల్డ్ మెడల్ నీకేపో!

ఒకవేళ భజన అనే పోటీ గనుక ఒలింపిక్స్‌లో ఉండి ఉంటే.. పాకిస్తాన్‌కు కచ్చితంగా ఆ పోటీల్లో గోల్డ్ మెడల్ వచ్చి తీరేదేమో!. విన్నర్ పోడియంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉండి ఉండేవారేమో!.. ఈ మాటలు అంటోంది ఆ దేశ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విపరీతమైన ప్రశంసలు గుప్పించాడు. కంబోడియా-థాయ్‌లాండ్ మధ్య తాజాగా కౌలాలంపూర్ ట్రంప్ సమక్షంలో శాంతి ఒప్పందం కుదరింది. ఈ నేపథ్యంలో.. శాంతి, స్థిరత్వానికి కృషి చేసే నాయకుండంటూ పాక్ ప్రధాని విపరీతమైన పొగడ్తలు గుప్పించారు. మొన్న గాజా శాంతి ప్రణాళిక.. ఇప్పుడేమో ఇది. మధ్యప్రాచ్యం, దక్షిణాసియాలో శాంతి కోసం ట్రంప్ చేసిన కృషి ప్రపంచాన్ని రక్షించింది. లక్షల మంది ప్రాణాలు పోకుండా నిలబెట్టింది అని షెహబాజ్ పేర్కొన్నారు. దీనిపై పాకిస్తాన్ మాజీ అమెరికా రాయబారి హుస్సేన్ హక్కానీ, షెహబాజ్ షరీఫ్‌పై వ్యంగ్యంగా స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ట్రంప్‌ను పొగడటంలో ఒలింపిక్ గోల్డ్ మెడల్ గెలిచే స్థాయిలో ఉన్నారంటూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ఫరీద్ జకారియా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. 'ఇది ఒలింపిక్ క్రీడ అయితే, షరీఫ్ పోడియం మీద గోల్డ్ మెడల్‌తో నిలిచేవారు అని అన్నారు.




ఈజిప్ట్‌లో జరిగిన గాజా శాంతి సదస్సులోనూ షరీఫ్ ట్రంప్‌ను విపరీతంగా పొడిగారు. ట్రంప్‌ను శాంతి పురుషుడిగా అభివర్ణిస్తూ నోబెల్ శాంతి బహుమతికి అర్హుడంటూ మాట్లాడారు. ఆ సమయంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ చిత్రమైన హావభావాలు ప్రదర్శించడం విపరీతంగా వైరల్ అయ్యింది. షరీఫ్ మాటలతో కడుపు నిండిపోయిన ట్రంప్ 'ఇక మాట్లాడేం లేదని, ఇంటికి వెళ్లిపోదాం' అంటూ వ్యంగ్యంఆ స్పందించడం మరో కొసమెరుపు. అయితే షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలను పాక్ పౌరులే భరించలేకపోయారు. అంతలా దిగజారి పొగడాల్సిన అవసరం ఏముందంటూ.. ప్రధానిని తిట్టిపోశారు కూడా.

# ఘోర విమాన ప్రమాదం.. 12మంది దుర్మరణం



నైరోబి: కెన్యాలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 12మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం కెన్యాలోని క్వాలే కౌంటీలో విమానం కూలింది. పర్యాటకులతో ప్రయాణిస్తున్న విమానం డయాని నుండి మాసాయి మారాలో కిచ్వా టెంబోకు బయలుదేరింది. అయితే బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయింది. విమాన ప్రమాదాన్ని కెన్యా పౌర విమానయాన అథారిటీ (కేసీఏఏ) ధృవీకరించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'డయాని నుండి కిచ్వా టెంబోకు వెళుతున్న 5YCCA రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన విమానం ఉదయం 8.30 గంటల సమయంలో కూలిపోయింది. విమానంలో 12మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు , దాని ప్రభావాన్ని నిర్ధారించేందుకు ప్రభుత్వ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లారు' అని కెన్యా సివిల్ ఏవియేషన్ అథారిటీ ప్రకటనలో పేర్కొంది. పోలీసుల ప్రకారం.. విమాన ప్రమాదంలో మరణించిన 12 మంది ప్రయాణికులు పర్యాటకులని తేలింది. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని పరిశీలించడానికి,దర్యాప్తు చేయడానికి ప్రభుత్వ సంస్థలు ఇప్పటికే సంఘటనా స్థలానికి చేరుకున్నాయని కేసీఏఏ డైరెక్టర్ ఎమిలే ఎన్.రావు తెలిపారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించబడినప్పటికీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ విషాదం చోటు చేసుకుందని స్థానిక మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం నుండి, తీరప్రాంతం పొగమంచు, మేఘాలతో కప్పబడి ఉండటం వల్ల పైలట్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ కథనాల్లో హైలెట్ చేశారు.



# మహా పత్రిక





## దాదాసాహెబ్ ఫాల్కే సలహా బోర్డ్ సభ్యురాలిగా సుధారెడ్డి



దాదా సాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సలహా బోర్డ్ సభ్యురాలిగా ప్రముఖ వ్యాపారవేత్త, సాంస్కృతిక రాయబారి సుధారెడ్డిని నియమితులయ్యారు. ఈమె కాకుండా బోర్డ్‌లో హిందూజా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ కల్నల్ పి.సి. సూద్, బరోడా మహారాణి హెచ్.హెచ్. రాధికరాజే గైక్వాడ్, వి.ఎం. సల్గావ్కార్ కార్పొరేషన్ చైర్మన్ దత్తరాజ్ సల్గావ్కార్, ఇండియన్ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా, ఇండియన్ కొరియోగ్రాఫర్ షియామక్ దావర్, దాదాసాహెబ్ ఫాల్కే ముని మనవరాలు గిరిజా ఫాల్కే మరాఠే, ఇన్ఫర్మేషన్ & బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో గౌరవనీయ సాంస్కృతిక నిపుణుడు & మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ భావనా మర్చంట్, సినీపోలిస్ ఇండియా ఫిల్మ్ ప్రోగ్రామింగ్ &డిస్ట్రిబ్యూషన్ హెడ్ మయాంక్ ష్రాఫ్ మరియు భారత ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ & బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలో క్రియేటివ్ ప్రొడ్యూసర్ & మాజీ సెన్సార్ బోర్డు జ్యూరీ జ్యోతి బధేకా తదితరులు ఉన్నారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే వారసత్వంలో డీపీఐఎఫ్ఎఫ్(DPIFF) సలహా బోర్డ్.. సాంస్కృతిక ప్రతిష్టకు నిలయంగా ఉద్భవించింది. కళాకారులు, చిత్రనిర్మాతలు, పరిశ్రమ నాయకులను నిరంతరం గౌరవిస్తూనే సినిమా రంగంలో ప్రపంచ కేంద్రంగా భారతదేశం యొక్క స్థాయిని బలోపేతం చేస్తుంది. ఇకపోతే అక్టోబరు 2930వ తేదీల్లో ముంబై వేదికగా దాదాసాహెబ్ ఫాల్కే అంతర్జాతీయ చలనచిత్రోత్సవ అవార్డులు 2025 కార్యక్రమం జరగనుంది.

### అల్లు అర్జున్- అట్లీ మూవీ..

## హీరోయిన్‌గా ఎవరంటే?

పుష్ప 2 బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత అల్లు అర్జున్ (Allu Arjun) మరో భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో ఆయన జతకట్టారు. వీరిద్దరి కాంబోలో తొలిసారి వస్తోన్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై కొన్ని నెలలుగా చర్చ నడుస్తూనే ఉంది. ఇప్పటికే ఈ మూవీలో బాలీవుడ్ భామ దీపికా పదుకొణెను ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. అంతే కాకుండా మరో ముగ్గురు రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కూడా నటిస్తున్నారని టాక్ నడిచింది.

ఈ నేపథ్యంలోనే తాజాగా హీరోయిన్‌కు సంబంధించిన మరో వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌లో సీతారామం బ్యూటీ హీరోయిన్‌గా కన్‌ఫామ్ అయినట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మృణాల్ షూట్‌లో కూడా పాల్గొన్నారని లేటేస్ట్ అప్‌డేట్. అంతేకాకుండా అల్లు అర్జున్‌తో కీలక సన్నివేశాలు షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కాంబోలో మృణాల్ ఎంట్రీలో మూవీపై మరింత బజ్ ఏర్పడింది. కాగా.. ప్రస్తుతం ఈ సినిమాను AA22xA6 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు హాలీవుడ్ టచ్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ మూవీలో హాలీవుడ్ హీరో విల్ స్మిత్ సైతం నటిస్తున్నట్లు కూడా వార్తలొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ మరికొందరిని హాలీవుడ్ పరిశ్రమకు చెందిన నటీనటులను ఈ మూవీ కోసం తీసుకోనున్నట్లు తెలిసింది. ఈ సినిమాను దాదాపు రూ. 800 కోట్ల బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే.







## నాన్నవాళ్ల స్నేహితుడే నన్ను వేధించాడు.. : హీరోయిన్

సామాన్యులకే కాదు సెలెబ్రెటీలకు కూడా లైంగిక వేధింపులు తప్పడం లేదు. ఇప్పుడు స్టార్ హీరోయిన్లుగా రాణిస్తున్నవారిలో చాలా మంది ఒకప్పుడు లైంగిక వేధింపులకు గురైనవారే ఉన్నారు. కొంతమందికి ఇండస్ట్రీ నుంచి ఎదురైతే..మరికొంతమందికి బయట నుంచే ఇలాంటి వేధింపులు వస్తుంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని ఉండడం వల్లే ఇప్పుడు ఉన్నత స్థానంలో కొనసాగుతున్నారు. హీరోయిన్ అయేషా ఖాన్(Ayesha Khan) కూడా చిన్నప్పడే లైంగిక వేధింపులకు గురైయ్యారట. బాబాయ్ లాంటివాడే తనతో అసభ్యకరంగా మాట్లాడి హింసించాడట. ఇప్పటికే ఆ సంఘటన గుర్తుకు వస్తే.. కళ్ల వెంట నీళ్లు ఆగవని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది ఆయేషా. ముంబైకి చెందిన ఈ బ్యూటీ..బుల్లితెర నటిగా ఎంట్రీ ఇచ్చి.. ఇప్పుడు వెండితెరపై రాణిస్తుంది. కసాటి జిందగీ కే అనే సీరియల్‌లో ఆమె ఓ చిన్న పాత్ర పోషించింది. కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు అయితే రాలేదు. హిందీ బిగ్‌బాస్ షో ఆమెను పాపులర్ చేసింది. సీజన్ 17లో పాల్గొన్న ఆమె..11 వారాల పాటు హౌస్‌లో ఉండి తనదైన ఆటతీరుతో అందరిని ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. ముఖచిత్రం సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో విశ్వక్‌సేన్ సరసన నటించి, మెప్పించింది. ఓ భీమ్ బుష్ సినిమాతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం బెంగాలీతో పాటు పలు హిందీ చిత్రాల్లోనూ నటిస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఆయేషా.. ఎప్పటికప్పుడు తన సినిమా అప్‌డేట్స్‌తో పాటు హాట్ ఫోటోలను షేర్ చేస్తూ తన ఫాలోవర్స్‌ని అలరిస్తోంది. కొన్నాళ్ల క్రితం ఆమె ఓ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చిన్నప్పుడు ఎదుర్కొన్న లైంగిక వేధింపుల గురించి చెప్పకొచ్చింది.

### రజనీకాంత్, ధనుష్ ఇళ్లకు

## బాంబు బెదిరింపులు



తమిళనాడులో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. పలువురు రాజకీయ ప్రముఖులతో పాటు సినీ తారల ఇళ్లకు వరుసగా బాంబు బెదిరింపులు వస్తుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాజాగా కోలీవుడ్ స్టార్ హీరోలు రజనీకాంత్(Rajinikanth), ధనుష్ ఇళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. చెన్నైలోని డీజీపీ కార్యాలయానికి సోమవారం(అక్టోబర్ 27) సాయంత్రం ఓ ఈ మెయిల్ వచ్చింది. పోయస్ గార్డెన్‌లో ఉన్న రజనీకాంత్, ధనుష్ ఇళ్లతో పాటు.. కీల్పాక్కంలో ఉన్న టీఎన్ సీసీ అధ్యక్షుడు సెల్వపెరుతంగై ఇంటిని పేల్చివేస్తామని ఆ ఈమెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అధికారులు వెంటనే బాంబు స్క్వాడ్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌ని రంగంలోకి దించి బెదిరింపులు వచ్చినవారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. బాంబు బెదిరింపుల నేపథ్యంలో చెన్నైలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ మెయిల్ పంపినవారిని గుర్తించేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులకు ఇలాంటి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ నెల 3న సీఎం స్టాలిన్‌తో పాటు హీరోయిన్ త్రిష, బీజేపీ కార్యాలయం, డీజీపీ ఆఫీసుకు బాంబు బెదిరింపులు రావడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్టోబర్ 13న కూడా సీఎం స్టాలిన్, హీరో రజనీకాంత్ ఇళ్లకు ఇలాంటి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.



### ఈ సారి మామూలుగా

## ఉండదు..

### డకాయిట్ కొత్త రిలీజ్ డేట్

టాలీవుడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తోన్న ఇంటెన్స్ యాక్షన్ ప్రేమకథా చిత్రం డకాయిట్. ఇప్పటికే రిలీజ్ తేదీ ప్రకటించినా అనివార్య కారణాలతో వాయిదా పడుతూనే వస్తోంది. గతంలో ఈ ప్రాజెక్ట్ నుంచి కోలీవుడ్ భామ శృతిహాసన్ అనూహ్యంగా తప్పకుంది. ఇది కూడా సినిమా ఆలస్యానికి కారణం కావొచ్చని తెలుస్తోంది. ఆ తర్వాత సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఈ మూవీలో హీరోయిన్‌గా చేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న క్రిస్‌మస్ సందర్భంగా రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ వారు అనుకున్న తేదీ ప్రకారం కుదరకపోవడంతో తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు డకాయిట్ మేకర్స్. వచ్చే ఏడాది ఉగాది కానుకగా డకాయిట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. 'ఈ సారి మామూలుగా ఉండదు.. వెనక్కి తిరిగి చూసేదే లేదు' అంటూ అడివి శేష్ మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో డకాయిట్ సందడి చేయనుందని ట్విటర్‌లో పోస్ట్ చేశారు. దీంతో అడివి శేష్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ మూవీని షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన 'క్షణం', గూఢచారితో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామేన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. కాగా.. ఇప్పటికే ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ చేయగా ఆడియన్స్‌ను ఆకట్టుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com